ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం

- చింతపల్లి, ముంచంగిపుట్టు, రాజవొమ్మంగిలలో 'గడప గడప'లో పాల్గొన్న ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, ధనలక్ష్మి



ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను గిరిజనులకు అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి



సంక్షేమ పథకాలను స్థానికులకు వివరిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, అరకు అసెంబ్లీ పరిశీలకులు కొండలరావు



వంచంగిలో గ్రామంలో పర్యటిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

చింతపల్లిరూరల్: ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని తాజంగి పంచాయతీ చీమలబంధ, చెరువీధి, తాళ్లకోట, రాజేంద్రపురం, బలభద్రం, సప్పిడిమెట్ట, బాసింగి కొత్తూరు, గెత్తంపాకలు గ్రామాల్లో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో 290 గడపలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సందర్శించా రు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్నారన్నారు. ప్రజలంతా మరోసారి జగన్ పాలనను కోరుకుంటున్నారని ఆమె చెప్పారు. నారా లోకేష్ పాదయాత్రతో ఒరిగేదేమి లేదని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి అన్నారు. యాత్రకు ప్రజాదరణ లేకపోవడంతో పార్టీ శ్రేణులు తలలు పట్టుకుంటున్నారని ఆమె విమర్శించారు. ఎంపీపీ కోరాబు అనూషాదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, వైస్ ఎంపీపీ వెంగళరావు , ఎంపీడీవో సీతయ్య, సర్పంచ్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా పథకాల అమలు

ముంచంగిపుట్టు: ఇంటింటికీ సంక్షేమం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు అసెంబ్లీ పరిశీలకులు కొండలరావు చెప్పారు.

సుజనకోట పంచాయతీ వనుగుపుట్టు, గొడ్డిపుట్టు, తోటపుట్టు, బీటా, తాల్లబుతోటలో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో 172 గడపలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో గిరిజనులు మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా ఇంటివద్దకే ప్రభుత్వ పథకాలు వచ్చేస్తున్నాయి..మధ్యవర్తి లేకుండా అకౌంట్‌లో డబ్బులు జమ అవుతున్నాయి, గ్రామ సచివాలయంలోకి వెళ్తే జవాబుదారీతనంగా సిబ్బంది పని చేస్తున్నారు..అందుకే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి అవ్వాలి.. మాకు ఈ పాలనే కావాలని.. ముక్తకంఠంతో కోరారు. గ్రామాల్లో ఎమ్మెల్యే పాల్గుణ, చైర్ పర్సన్ సుభద్ర, అరకు అసెంబ్లీ పరిశీలకుడు కొండలరావులకు గిరిజనులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అరకు ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. మరోసారి జగనన్నను ముఖ్యమంత్రి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు.

నిరంతరం గిరిజన అభివృద్ధి కోసం పనిచేసే ముఖ్యమంత్రి జగనన్న దొరకడం మన అదృష్టమన్నారు. అరకు అసెంబ్లీ పరిశీలకుడు కొండలరావు, ఎంపీపీ అరిసెల సీతమ్మ, సర్పంచ్‌లు రమేష్, భాగ్యవతి, ఎంపీటీసీలు సుబ్బలక్ష్మి, కొండమ్మ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ సోభ సోమేశ్వరి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, ఎంపీడీవో రమేష్, పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి చెట్టి గంగాధర్ స్వామి, నాయకులు గంగారావు, బాబూరావు, ఉదయ్, జయదేవ్, సురేష్, రాంప్రసాద్, నాగేశ్వరరావు, శంకర్‌రావు, రామ్మూర్తి, సుందరరావు, దామోదం తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమం

రాజవొమ్మంగి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గడప గడపకు సంక్షేమం అందుతోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని వంచంగి, బలిజపాడు, కుంతీదేవివాకవీధిలలో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లోని 280 గడపలను ఎమ్మెల్యే ధనలక్ష్మి పర్యటించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్లను గామస్తులకు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా కుంతీదేవి వాక వీధిలో కాకూరి రామయమ్మ అనే మూగ యువతిని, కంటి సమస్యతో బాధపడుతున్న విద్యార్థి కోసూరి శ్రీనుబాబులను ఆప్యాయంగా పలుకరించి వారి సమస్యలు పరిష్కరించాలని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. వంచంగిలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని గ్రామస్తులకు ఎమ్మెల్యే ధనలక్ష్మి హామీ ఇచ్చారు. పార్టీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ, జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్‌రాజు, ఎంపీపీ గోము వెంకట లక్ష్మి, వైస్ ఎంపీపీ చంద్రరాణి, రాజేశ్వరి, ఎంపీటీసీలు కోసూరి చిన్నాలమ్మ, గంగదుర్గ, సర్పంచ్‌లు కాంతం, చంద్రుడు, ఆదిరాజు, మురళీకృష్ణ, నాగేశ్వరరావు, ఎంపీడీఓ బాపన్నదొర, డిప్యూటి తహసీల్దార్ సత్యనారాయణ, ఏఈలు చలపతి, సురేష్, ఎస్ఐ షరీఫ్, నాయకులు జాన్‌బాబు, దుర్గాప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇన్‌చార్జి ఎంపీడీవోగా శ్రీనివాసులు



ఇన్‌చార్జి ఎంపీడీవోకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

వై.రామవరం: మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా బి.శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో అశోక్‌కుమార్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఆయన నియమితులయ్యారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసును మర్యాదపూర్వకంగా కలసి, పుష్పగుచ్ఛం అందించారు.వారు మాట్లాడుతూ అందరూ సమష్టిగా పనిచేసి మండలాన్ని అభివృద్ధి చేద్దామన్నారు. అనంతరం అధికారులు, సిబ్బందితో మండలంలోని సమస్యలపై చర్చించారు. వైస్ ఎంపీపీ వలాల విశ్వమ్మ, ఎంపీటీసీ వి.సుబ్బలక్ష్మి, ఏపీఓ ప్రకాశబాబు, పంచాయతీ కార్యదర్శి మధుసూధనరాజు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

పాడేరు రూరల్ : మన్యంలో జాతరలు, పండగలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని ఇరడాపల్లి పంచాయతీ ఎస్.బొడ్డాపుట్టు గ్రామంలో ఈ నెల 16,17,18 తేదిల్లో నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్లను పాడేరులోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఉత్సవాలకు తాను పట్టు వస్త్రాలు, పూజా సామగ్రి అందజేస్తానని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి చెప్పారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ చైర్మన్ గల్లెలి లింగమూర్తి పిలుపునిచ్చారు. నాయకులు సత్యనారాయణ, చిట్టిబాబు, ఉత్సవ కమిటీ సభ్యులు సత్యనారాయణ, రాజారావు, అప్పలకొండ, ఉమామహేష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



చేతిబోరును ప్రారంభిస్తున్న ఎంపీపీ అమల

చింతూరు: మండలంలోని మామిళ్లగూడెంలో ఎంపీపీ నిధులతో మంజూరైన చేతిపంపును సోమవారం ఎంపీపీ సవలం అమల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేతిబోరు లేకపోవడంతో గుంపువాసులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సర్పంచ్ ముచ్చిక నాగార్జున తన దృష్టికి తీసుకు రావడంతో మండల పరిషత్ ద్వారా నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. చేతిబోరు మంజూరుకు కృషి చేసిన ఎంపీపీ, సర్పంచ్‌లకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. చింతూరు సర్పంచ్ కారం కన్నారావు, సాయిబాబు, శోభన, జయలక్ష్మి, ప్రసాద్, లక్ష్మి, నవీన్, పెంటయ్య పాల్గొన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు



రైతులకు సబ్సిడీపై వాటర్ మోటార్‌ను అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

వై.రామవరం: మడుగుకోట గ్రామంలో గిరిజన మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందజేశారు. గ్రామంలోని రైతులకు వాటర్ మోటార్లు, బరకాలు తదితర వ్యవసాయ పరికరాలను సబ్సిడీపై పంపిణీ చేశారు. ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ జి.బాబూరావు, శ్రీను, మంగిరెడ్డి, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

రహదారి పనులకు శంకుస్థాపన



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

వై.రామవరం: మండలంలోని పాతకోట గ్రామం నుంచి తంగేడు కోట గ్రామానికి మెటల్ రోడ్డు నిర్మాణానికి సోమవారం స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు శంకుస్థాపన చేశారు. రూ.50లక్షల నిధులతో నిర్మిస్తున్న ఈ రోడ్డుకు ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు ముర్ల జోగిరెడ్డి, వలాల విశ్వమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు వీరమళ్ల సుబ్బలక్ష్మి ముఖ్య అతిథులుగా పాల్గొని భూమిపూజ చేశారు. మండల కన్వీనర్ ఎం.అప్పారావు, నాయకులు త్రిమూర్తులు, ఎం.భారతి బాబు, బాబి, కనకరాజు, బలిరెడ్డి నూకరాజు, అబ్బాయి రెడ్డి, విజయకుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యతో సతమతం

- నిరుపయోగంగా సోలార్ తాగునీటి పథకం
- కించూరు గిరిజనులకు ఊటనీరే గతి



మూలకు చేరిన సోలార్ తాగునీటి పథకం

సాక్షి,పాడేరు: గత టీడీపీ ప్రభుత్వ హయంలో నిర్మించిన సోలార్ తాగునీటి పథకాలు పాడై అనేక చోట్ల నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. మండలంలోని మారుమూల పంచాయతీ కేంద్రమైన కించూరులో సుమారు రూ.8లక్షల వ్యయంతో నిర్మించిన సోలార్ తాగునీటి పథకం నిరుపయోగంగా మారడంతో తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోటార్ వ్యవస్థ చెడిపోవడంతో మూడేళ్ల నుంచి ఈ పథకం ద్వారా తాగునీటి సరఫరా నిలిచిపోయిందని, తాగునీటికి ఊటనీటినే ఆశ్రయిస్తున్నామని ఆందోళన చెందుతున్నారు. కలుషిత నీటి వినియోగంతో తరచూ రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు.48 కుటుంబాలు ఉన్న కించూరు గ్రామంలో గిరిజనులు తాగునీటి అవసరాలకు గ్రామ సమీపంలో కొండ నుంచి వృథాగా పోతున్న ఊటనీటిని గిరిజనులు సేకరించి, అన్ని అవసరాలకు వినియోగిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని సర్పంచ్ వంతాల రాంబాబుతో పాటు స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కరిస్తాం

కించూరు గ్రామానికి జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి తాగునీటిని సరఫరాకు చర్యలు తీసుకుంటున్నాం. పనులకు సంబంధించి త్వరలో టెండర్ల ఆహ్వానిస్తాం. టెండర్ ప్రక్రియ పూర్తవగానే పనులు చేపడతాం. అలాగే పాడైన సోలార్ తాగునీటి పథకాన్ని బాగుచేసి, వినియోగంలోకి తెచ్చి తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం.

– ప్రకాష్, ఆర్‌డబ్ల్యూఎస్, డీఈఈ, పాడేరు

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



నాయకులతో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పెదబయలు: పార్టీ గెలిపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు, గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లు సమష్టిగా పనిచేయాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండల కేంద్రంలోని సోమవారం స్థానిక నాయకులతో పార్టీ బలోపేతంపై చర్చించారు. ఈ సందర్భంగా అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ అరకు నియోజకవర్గంలోని ఈ నెల 11 నుంచి జరుగుతున్న ×మా నమ్మకం నువ్వే జగనన్న₹ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అలాగే ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరు కష్టపడాలన్నారు. ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధర స్వామి, రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారయణ, యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, జెడ్పీటీసీ బొంజుబాబు, రాష్ట్ర అగ్రో డైరెక్టర్ సన్యాసి, నాయకులు బాలంనాయుడు, సూరయ్య, బాలరాజు, దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

10న పశు వైద్య శిబిరం

డుంబ్రిగుడ: మండలంలోని అరకు సంతబయలు గ్రామంలో ఈ నెల 10న మెగా పశు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు పశుసంవర్ధక శాఖ ఏడీ అశ్వత్థామ సోమవారం తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ అరకు సంతబయలు గ్రామంలోని వారపు సంతలో వైఎస్సార్‌సీపీ నాయకుల సహకారంతో నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరంలో పశువులకు పరీక్షలు చేసి, రైతులకు ఉచితంగా మందులు అందజేయనున్నట్టు చెప్పారు. ఆయా ప్రాంత రైతులు పశు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు ప్రజావేదిక

కొయ్యూరు: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఉపాధి హామీ పథకం పనులపై మంగళవారం ప్రజావేదిక నిర్వహించనున్నట్టు ఏపీవో రాజు సోమవారం తెలిపారు. మండలంలోని 33 పంచాయతీల్లో ఉపాధి పనులపై ఆడిట్ పూర్తయిందన్నారు. ఈ మేరకు నిర్వహిస్తున్న ప్రజావేదికలో పనులకు సంబంధించిన ఖర్చులు తదితర వివరాలు వెల్లడిస్తామని, డ్వామా పీడీ సహ ఇతర అధికారులు హాజరవుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని వివిధ సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు.

గృహ సారథుల సమావేశం నేడు

డుంబ్రిగుడ: మండలంలోని 18 పంచాయతీల గృహ సారథుల సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ హాజరుకానున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమానికి గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. గ్రామాల్లో పార్టీ మరింత బలోపేతం, సంక్షేమ పథకాల అమలుపై చర్చించనున్నట్టు పేర్కొన్నారు.

గ్రామాల్లో వీధిలైట్లు



వీధిలైట్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

అరకులోయ: మండలంలోని పద్మాపురం పంచాయతీలోని అన్ని గ్రామాల్లో పాడైన వీధిలైట్ల పునరుద్ధరణకు సర్పంచ్ పెట్టెలి సుస్మిత చర్యలు తీసుకున్నారు. యండపల్లి వలస, పద్మాపురం గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది సోమవారం కొత్తగా వీధిలైట్లు ఏర్పాటుతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నాయకుడు సుంక్ర తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి హిమబిందు

గూడెంకొత్తవీధి: గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని దారకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి డీకే హిమబిందు అన్నారు.జీకే వీధి పీహెచ్‌సీలో గర్భిణులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని, తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రసవాలకు ముందే గర్భిణులు చింతపల్లిలోని వసతి గృహంలో చేరడం వలన ఎటువంటి ప్రమాదం లేకుండా సుఖప్రసవం పొందవచ్చన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



బీమా నగదు అందజేస్తున్న నాయకులు

సీలేరు: సీలేరు సచివాలయం పరిధిలో గాజువాక వీధిలో ఇటీవల మృతి చెందిన ఎం.వెంకటరమణకు ప్రభుత్వం వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయంగా రూ.10వేలు మంజూరు చేసింది. ఈ మేరకు నగదును మృతుడు భార్య రామలక్ష్మికి సర్పంచ్ ప్రసాద్, ఎంపీటీసీ సాంబమూర్తి, నాయకులు స్వర్ణలత, బుజ్జి, రాము, వెంకటరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ ఎల్.లోవకుమారి సోమవారం అందజేశారు. మిగిలిన సొమ్ము బ్యాంకులో జమ అవుతుందని చెప్పారు. వలంటీర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో పోలీసు ల్యాండ్‌లైన్ సేవలు

రాజవొమ్మంగి: ఫిర్యాదుదారుల సదుపాయం కోసం రాజవొమ్మంగి స్టేషన్ ల్యాండ్‌లైన్ నంబర్(08865-275533) అందుబాటులో తీసుకొచ్చామని ఎస్ఐ గోపీ నరేంద్రప్రసాద్ తెలిపారు.24 గంటలు సేవలుంటున్నాయన్నారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సేవలు అందుబాటులోకి తెచ్చామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాఫీ రైతులను ఆదుకోవాలి

అనంతగిరి: కాఫీ రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించి, రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని, సీపీఎం నాయకుడు కొండలరావు అన్నారు. పెదకోట పంచాయతీ తంకోట గ్రామంలోని కాఫీ రైతులతో కలిసి మాట్లాడారు. కాఫీ రైతులకు రావాల్సిన 60 కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలని, కాఫీకి గిట్టుబాటు ధరను కల్పించాలని కోరారు.

వాహన తనిఖీలు

వై.రామవరం: మండల కేంద్రంలో ఎస్ఐ ఎం.సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు. లోతట్టు ప్రాంతాల నుంచి వచ్చి వెళ్లే వాహనాలను, వాటిలో రవాణా చేస్తున్న సామగ్రిని సోదా చేశారు. అనుమానితులు, అపరిచితులపై గట్టి నిఘా విధించారు. వాహన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌లు సక్రమంగా లేని వాహనాలపై కేసులు నమోదు చేశారు. సీఐ వై.రాంబాబు ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించినట్టు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. తనిఖీల్లో స్టేషన్ సిబ్బందితో పాటు సీఆర్‌పీఎఫ్–డి42 బెటాలియన్ పోలీసులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అడ్డుకోవాలి

అనంతగిరి: గ్రామాల్లో బాల్య వివాహాలు జరుగుతున్నట్టుగా తెలిస్తే తమకు సమాచారం ఇస్తే అడ్డుకుంటామని చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జిల్లా కన్వీనర్ బాకా లవకుశ అన్నారు. మండలంలోని తుమ్మనవలస ప్రాథమిక పాఠశాలను ఆయన సోమవారం సందర్శించారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయలపై అడిగి తెలుసుకున్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాల్యవివాహాలు చేస్తే అలాంటి వారిపై చట్ట వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయులు అరుణ, మహిళా పోలీస్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

కొండమ్మకు ఘన నివాళి



కొండమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, డాక్టర్ నరసింగరావు, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు తదితరులు

సాక్షి,పాడేరు: ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు మాతృమూర్తి సతక కొండమ్మ సంతాప సభను సూకురుపుట్టులో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు తదితరులు ఘనంగా నివాళులర్పించారు.మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, నేను సైతం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కె.శివప్రసాద్, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షురాలు సరస్వతితో పాటు నాయకులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లంతా అధిక సంఖ్యలో హాజరై కొండమ్మ చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబుతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

టీచర్లు, విద్యార్థుల హాజరు నమోదు తప్పనిసరి



విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో మల్లేశ్వరరావు

అడ్డతీగల: ప్రతి రోజు ఉపాధ్యాయులు ఫేషియల్ యాప్‌లో విద్యార్థుల హాజరు ఆన్‌లైన్‌లో నమోదు తప్పనిసరి అని ఎంఈవో వై.మల్లేశ్వరరావు అన్నారు. అడ్డతీగలలోని ఆశ్రమ బాలికలు, బాలుర ఉన్నత పాఠశాలలను ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు నిర్దేశక ప్రణాళికను పరిశీలించారు. విద్యార్థులకు పలు సబ్జెక్టులలో ప్రశ్నలు వేసి సమాధానాలు తెలుసుకున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌ల వినియోగంపై అవగాహన కల్పించారు.

పశువులకు వ్యాక్సిన్ తప్పనిసరి



గొర్రెలకు వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

డుంబ్రిగుడ: మండలంలోని కంద్రుం పంచాయతీ బెడ్డగుడ, కంద్రుం, జోడిగుడ, జాకరవలస, దండగుడ తదితర గ్రామాల్లో పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పశు సంవర్ధక శాఖ వైద్యాధికారి గౌతమ్ మాట్లాడుతూ మేకలు, గొర్రెలు వ్యాధులు రాకుండా ముందస్తుగా వ్యాక్సిన్ వేయించాలని రైతులు సూచించారు. పశు వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సిబ్బంది అనురాధ, సుబ్బారావు, త్రినాథరావు, సంజీవ్, జయరాజు, జానకి, అప్పారావు, అనంతరావు, రత్నం తదితరులున్నారు.

నేడు యర్రంరెడ్డిపాలెంలో 'గడప గడపకు'

వై.రామవరం: మండలంలోని యర్రంరెడ్డిపాలెం యర్రంరెడ్డిపాలెం గ్రామ సచివాలయం పరిధిలోని గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొంటున్నట్టు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.